క్లుప్తంగా

నియోజకవర్గ క్రీడా పోటీలకు ఎంపికలు రేపు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా, ఆటల ఎంపిక పోటీలు సోమవారం పెందుర్తి మండలం జుత్తాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్ పి.లక్ష్మి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 28న లంకెలపాలెం హైస్కూల్‌లో నిర్వహించాల్సి ఉండగా వర్షాలకు మైదానం చిత్తడిగా మారడంతో తేదీతోపాటు వేదిక కూడా మార్చాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బాడ్మింటన్, యోగా పోటీలకు నియోజకవర్గ జట్లను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు మార్పును గమనించాలని ఆమె కోరారు.

వైభవంగా ఏకాదశి తిరువీధి



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాలస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్ఠింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు రంగనాథాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగ వితరణ చేపట్టారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

పెందుర్తి: స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించి, ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. పెందుర్తి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు లక్ష్మీనారాయణ, పవన్, పలువురు యువకులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ ఎంపికలు రేపు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో ఈ నెల 30న ఉదయం 9 గంటలకు రైఫిల్ షూటింగ్ కోసం ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వి.దేవుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 అండర్-19 బాల బాలికల రైఫిల్ షూటింగ్‌కు ఉమ్మడి జిల్లాల నుంచి జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలిజిబిలిటీ ఫారం, ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు.

బాలుడి వైద్య పరీక్షలకు వితరణ



బాలునికి చెక్ అందిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్

పెందుర్తి: ఆర్థిక స్తోమత లేని కారణంగా వైద్య పరీక్షలు చేయించుకోలేకపోతున్న ఓ నిరుపేద దివ్యాంగ బాలుడికి పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. బాలుడి వైద్య పరీక్షల కోసం రూ.10 వేలు సమకూర్చింది. ఆ నగదును పెందుర్తిలోని ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. ట్రస్ట్ ప్రతినిధి సిరిమల్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్ర రాజకీయాల 'బాబు'కు బుద్ధినివ్వు

- దేవుడి పేరిట రాజకీయాలు చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య
- స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, వంద రోజుల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే లడ్డూ వివాదం
- తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ అడిగితే ప్రభుత్వం తోక ముడిచింది
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను డిక్లరేషన్ అడగడం సిగ్గుచేటు
- మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- నియోజకవర్గంలో పలుచోట్ల 'బాబు పాపాల ప్రక్షాళన'కు పూజలు



పెందుర్తి వేంకటాద్రిపై ఉన్న వెంకన్న ఆలయానికి కాలినడకన వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



'బాబు పాపాల ప్రక్షాళన' కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు



మొగలిపురంలో వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న గండి రవికుమార్, పార్టీ శ్రేణులు

'వెంకన్న స్వామీ సీఎం చంద్రబాబును క్షమించి, సద్బుద్ధి కలిగేలా దీవించు. ఆయన చేసిన పాపాలకు రాష్ట్ర ప్రజలు ఇబ్బంది పడేలా కన్నెర్ర చేయకు. కూటమి నేతల కుటిల రాజకీయాలకు సామాన్యులు బాధపడే పరిస్థితి రానీయకు. మా పూజలు గైకొని.. ఆయన చేసిన పాపాలను ప్రక్షాళన చేసి నీ చల్లని చూపులు రాష్ట్ర ప్రజలపై కలకాలం ఉండేలా చూడు తండ్రీ..' అంటూ నియోజకవర్గంలో పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. తిరుపతి లడ్డూలో కల్తీనెయ్యి ఆరోపణలు చేసిన చంద్రబాబు, కూటమి నేతల పాపాలను ప్రక్షాళన చేయాలంటూ వేంకటేశ్వరస్వామిని వేడుకున్నారు.

పెందుర్తి: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు క్షుద్ర రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. దేవుడి పేరిట తప్పుడు రాజకీయాలు చేయడం చంద్రబాబుకు కొత్త కాదన్నారు. 'బాబు పాపాల ప్రక్షాళన'కార్యక్రమంలో భాగంగా పెందుర్తి వేంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం అయిన విశాఖ ఉక్కు పరిశ్రమను బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం ప్రవేటు పరం చేసే కుట్రను డైవర్ట్ చేసేందుకే తిరుపతి లడ్డూ వివాదాన్ని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సృష్టించారన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు కనీసం ఒక్క సంక్షేమ పథకం అందించలేదని.. దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తప్పుడు ప్రచారానికి తెర తీశారని ఆరోపించారు. తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తే కూటమి ప్రభుత్వం తోక ముడిచిందని ఎద్దేవా చేశారు. నిజంగా లడ్డూలో కల్తీ నెయ్యి వాడితే విచారణ చేయించడానికి ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. లడ్డూ వివాదంలో కూటమి ప్రభుత్వం డొల్లతనం బయటపడడంతో మరో వివాదానికి తెరతీశారన్నారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర ప్రారంభం, ముగింపు సమయంలో దర్శనంతో పాటు, ముఖ్యమంత్రి హోదాలో ఐదుసార్లు తిరుపతి వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన వ్యక్తికి ఇప్పుడు స్వామివారి దర్శనానికి డిక్లరేషన్ ఇవ్వాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. మాజీ సీఎం జగన్ విషయంలో డిక్లరేషన్ అడుగుతున్న కూటమి ప్రభుత్వ పెద్దలు.. బాప్టిజం తీసుకున్నానని స్వయంగా చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర ప్రభుత్వ ప్రతినిధుల విషయంలో డిక్లరేషన్ అడగగలరా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న నీతిమాలిన రాజకీయాల్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ముందుగా వేంకటాద్రికి కాలినడకన చేరుకుని స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు పీఎస్ రాజు, బోకం రామునాయుడు, మెంటి మహేష్, గొరపల్లి శ్రీను, దాసరి సత్తిబాబు, చిరికి దేముడు, దాడి మహేష్, కర్రి బాబు, కొటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, చొప్పా నాగరాజు, పాలిశెట్టి సురేష్, కొయిలాడ శ్రీను, కోన శ్రీను, నక్కా మహేష్, లెక్కల రమేష్, కిల్లి అప్పారావు, సన్నిబాబు, అవగడ్డ వాసు, రఘు, కిషోర్, పెదిశెట్టి శేఖర్, సీతారామయ్య, బొంది అచ్చిబాబు, రాపేటి రాము, డి.శ్రీను, రాము, నాగభూషణం, బోని నాయుడు, ఉగ్గిన నాయుడు, గవర రాజు, యర్ర శ్రీను, నదియా, యర్రయ్య, సంతోష్, దేముడుబాబు, గొరపల్లి సాంబ, పరమేష్, సుందరపు అప్పారావు, గెంజి సురేష్, ఎంపీ రెడ్డి, బొట్ట చిరంజీవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగలిపురం రామాలయంలో..

సబ్బవరం: ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందికొలిచే కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని తమ నీచ రాజకీయాలకు వాడుకోవడం కూటమి నాయకులకు తగదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ హితవుపలికారు. మండలంలోని మొగలిపురం రామాలయంలో వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి లడ్డూ ప్రసాదంపై భక్తులు మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్న కూటమి నాయకులు తమ మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం, జగన్‌ను దెబ్బతీసేందుకు కోట్ల మంది భక్తులు విశ్వసించే తిరుపతి లడ్డూ పవిత్రతపై ఆరోపణలు చేస్తున్నారని ఆక్షేపించారు. త్వరలోనే భక్తులు సరైన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందన్నారు. 100 రోజుల పాలనా వైఫల్యాలపై ప్రజలు తిరుగుబాటు చేయకుండా, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో స్వామివారికి పూజలు జరిపి, భజనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ శిరపరపు వాసు, నాయకులు ఐడీ బాబు, దేముడు, గండి ముత్యాలనాయుడు, గురి నాగమణి, అప్పికొండ సత్యనారాయణ, బైలపూడి బంగారయ్య పాల్గొన్నారు.

అప్పన్న తొలిపావంచా వద్ద పూజలు

సింహాచలం: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం పూజలు నిర్వహించారు. చంద్రబాబు పాప ప్రక్షాళన పేరిట కొండ దిగువ తొలి పావంచా వద్ద స్వామి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టారు. చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు. వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహంలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో హిందూ దేవాలయాల అభ్యున్నతికి జగన్ పెద్దపీట వేశారన్నారు. ధూపదీప నైవేద్యాల కింద వేలాది ఆలయాలకి సాయం అందించారన్నారు. తిరుమల నెయ్యిపై చంద్రబాబు అండ్ కో రాద్ధాంతం మానుకోవాలని హితవు పలికారు. వాస్తవాలు బయటపడితే వారంతా ఖంగుతినే పరిస్థితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు లంక సత్తిబాబు, బొట్టా శ్రీను, దమ్ము ఎర్రాజీరావు, తెడ్లపు మహేష్, ఆదిరెడ్డి, మజ్జి ధర్మా, నారు వెంకటరమణ, మజ్జి అప్పలరమణ, లండ భాస్కర్, అక్కిరెడ్డి శేషు, శిడగం తాతబాబు, ఎస్.అప్పారావు, టి.రాము, బోర లక్ష్మణరెడ్డి, మధురెడ్డి పాల్గొన్నారు.



సింహాచలం తొలిపావంచా వద్ద పూజలు చేస్తున్న 98వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు

దసరా ఉత్సవాలు ప్రారంభం



పరవాడ సంతబయలులో దసరా ఉత్సవాలను ప్రారంభిస్తున్న యంగ్‌మెన్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక పెద్దలు



పెదముషిడివాడలో దుర్గా నవరాత్రులకు రాట వేసిన స్థానికులు

పరవాడ: స్థానిక సంతబయలు వద్ద దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలను యంగ్‌మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు శనివారం ప్రారంభించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొని పీఠానికి పూజలు జరిపారు. అనంతరం రామునాయుడు మాట్లాడుతూ దుర్గాదేవిని అమ్మవారిని వచ్చే నెల 3న ప్రతిష్టిస్తామన్నారు. 9 రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 12న అనుపు మహోత్సవం వేడుకగా నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కర్రి ఎర్రినాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బి.రామారావు, మాజీ ఉప సర్పంచ్ పోతల అప్పలనాయుడు, చుక్క వెంకటలక్ష్మి, వెన్నల సన్యాసిరావు, జూనియర్ అప్పలనాయుడు, టీవీ అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, బానోత్ బలరాం, బి.ఆనంద్, జి.చంద్రారావు, పి.జగదీశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా పెదముషిడివాడ గ్రామంలో శనివారం రాట మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొండా అచ్చిబాబు, యలమర్తి బుజ్జి, కబడ్డి అప్పారావు, కలవలపల్లి సత్తిబాబు, అరుణ్, సేనాపతి త్రినాథ్, సంతోష్, భవానీ మాతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో మండలంలోని వివిధ ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. వ్యాసరచన పోటీల్లో కె.విరాజిత, ఎ.దస్వంత్‌బాబు, జి.సౌజన్య, వక్తృత్వ పోటీల్లో పి.అచ్యుతరావు, ఎలీసా లైఫ్, కె.బాపు విజేతలుగా నిలిచారు. ఎంఈవో-1 డి.త్రినాథరావు, ఎంఈవో-2, టి.మధుమూర్తి, రిసోర్స్ పర్సన్ సింగంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధనలు



గణపతిని దర్శించుకుంటున్న గండి రవి, కమిటీ ప్రతినిధులు



అన్నవద్దన చేస్తున్న కర్రి అప్పలస్వామి

పెందుర్తి: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా కరకవానిపాలెంలో శనివారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ యూత్ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

5 వేల మందికి అన్నసమారాధన

సింహాచలం: 98వ వార్డు కాపుదిబ్బలో యూనిటీ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో 21 రోజులుగా నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం సుమారు 5 వేల మందికి అన్నసమారాధన జరిపారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, వరహా దేవరాయ తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు ఎన్ని భాస్కరరావు, యూనిటీ యూత్ ఫ్రెండ్స్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీలక్ష్మి తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు శనివారం జరిగాయి. ఈ పోటీలను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.శ్రీలక్ష్మితో కలిసి ప్రారంభించారు. దీనిలో భాగంగా చెస్, క్యారమ్స్, మార్షల్ ఆర్ట్స్‌లో పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 30న కబడ్డీ, వాలీబాల్ క్రీడా ఎంపిక పోటీలను చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు సుధాకర్, సీఎల్ఎస్ ప్రసాద్, సూర్యనారాయణతో పాటు వివిధ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

నాగరాజుకు నివాళి



దివంగత నాగరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: కన్నూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి భర్త, ఎంపీటీసీశ్రీనివాసరావు తండ్రి దివంగత గొల్లవిల్లి నాగరాజు పెద్దకర్మ శనివారం కన్నూరు గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్‌లు దివంగత నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు బండారు రామారావు, బొద్దపు చిన్నారావు, మడక సూరిబాబు, కోరుకొండ వెంకటరమణ, గంతకోరు రవి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


- ఎన్టీపీసీ ఎదుట సీఐటీయూ ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్టీపీసీ మెయిన్‌గేటు ఎదుట శనివారం సీఐటీయూ ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఎన్టీపీసీ లోగోతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్‌లను స్కిల్డ్ కార్మికులకు కూడా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టరు మారినపుడు కార్మికులను వేధింపులు, తొలగింపులు చేయరాదన్నారు. వైద్య పరీక్షల పేరుతో కార్మికుల అక్రమ తొలగింపులకు యాజమాన్యం పూనుకోవడం దుర్మార్గమన్నారు. కార్మికులకు జీతాలు బకాయిలు పెట్టిన కాంట్రాక్టర్లపై యాజమాన్యం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులతో అధిక పనులు చేయించుకుని డబుల్ ఓటీ ఇవ్వకుండా సింగిల్ ఓటీ చెల్లిస్తున్నారని, మరికొన్ని సైట్లలో ఓటీ కూడా చెల్లించట్లేదని ఆక్షేపించారు. చట్టప్రకారం కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన ఈఎస్ఐ, బోనస్, సెలవులు, గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మహారత్న పరిశ్రమలో కార్మికులను చిన్న చూపు చూడడం తగదన్నారు. సీఐటీయూ నాయకులు గోవిందరాజు, నాయుడు, రామారావు పాల్గొన్నారు.

మరణించిన మిత్రుని కుటుంబానికి సాయం



మృతుని భార్యకు చెక్కు అందిస్తున్న మిత్రులు

సబ్బవరం: స్నేహితుడు మృతి చెందడంతో కష్టాల్లో ఉన్న కుటుంబానికి సహచర పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సబ్బవరంలోని జోడుగుళ్లకు చెందిన బండారు రమణ ఈ నెల 16న మరణించాడు. మృతునికి భార్య, ట్రిపుల్ ఐటీ చదువుతున్న కుమార్తె, 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. మృతునితో సబ్బవరం ప్రభుత్వ హైస్కూల్లో టెన్త్ చదివిన పూర్వవిద్యార్థులు తలా కొంత సర్దుబాటు చేసి, రూ.42,500 చెక్కును అందించారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా జిలానీ బేగం




జిలానీ బేగం

సబ్బవరం: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా జిలానీ బేగం శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నక్కపల్లి నుంచి సబ్బవరానికి వచ్చారు. అనంతరం తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇకపై సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవల్ని నిలిపివేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ హోల్డింగ్ పట్టాల రిజిస్ట్రేషన్లనూ నిలిపివేశామన్నారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా అందించే అన్ని రకాల సేవలను శక్తి వంచన లేకుండా అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చోరీ

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన గంపరాయ భాగ్యలక్ష్మి ఇంట్లో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బంగా రు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. పర వాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో భద్రపరచుకున్న ముప్పావు తులం బంగారు ఆభరణాలు, 9 తులాల వెండి పట్టీలు, రూ.50 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు భాగ్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం ఉదయం గరుడసేవ విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింజేశారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ అర్చన చేశారు. విశేష హారతి అందించారు. భక్తులతో గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉత్సాహంగా డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే



డ్యాన్స్‌లతో అలరిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుక శనివారం ఉత్సాహంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, కళాశాల ప్లానింగ్, అభివృద్ధి కమిటీ సభ్యులు కొటాన రాము, గవర శ్రీనివాసరావు, డాక్టర్ గుల్లేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్యార్థి దశ చాలా కీలమైనదని, విద్యార్థులు ఉన్నత ఆశయాలు, క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. సత్ ప్రవర్తనతో జూనియర్లు, సీనియర్లనే భేదం లేకుండా అన్నదమ్ముల్లా పరస్పరం సహకరించుకుంటూ, కలిసిమెలిసి చదువుకోవాలన్నారు. విద్యార్థులు డ్యాన్స్‌లు, ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్‌తో పాటు కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.